జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
మంగళవారం | 5 | నవంబర్ | 2024 ◆ పేజీలు : 6

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

### కలెక్టర్ బి సత్యప్రసాద్



*జగిత్యాల, నవంబర్ 4, ప్రజాజ్యోతి*

రాయికల్ మండలంలోని మహితాపూర్ మరియు రామోజీపేట్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం ఎంత మొత్తంలో వస్తుంది, ధాన్యానికి సంబంధించిన తేమ ఏ విధంగా ఉందని పరిశీలించారు. అలాగే ధాన్యాన్ని తీసుకొని దాని మ్యాచర్ ఏ విధంగా ఉంది అని తనిఖీ చేశారు. సంబంధిత ఏఈఓ ను కేంద్రం ఏ విధంగా నడుస్తుంది అని తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్ ఎమ్మార్వో ఖయ్యూం మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# ఆసుపత్రి ప్రచారానికి "ఆరోగ్యశ్రీ"

- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం

- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కవితకు కాదేది అనర్హం అన్న విధంగా ప్రచారానికి సైతం కాదేది అనర్హం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు కొంతమంది అక్రమార్కులు. డబ్బు సంపాదనే ధ్యేయంగా వారి ఇష్టం వచ్చిన విధంగా ప్రచారాలు చేస్తూ రోగులను ఆకర్షిస్తున్నారు కొంతమంది వైద్యులు. ఆ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు లేకున్నా ఉన్నాయంటూ పోచారం చేస్తున్నారు. కొంతమంది వైద్యులు మెడికల్ బిల్స్ లో తగ్గింపు ఇస్తామని ప్రచారాలు చేసుకుంటుంటే మరి కొంతమంది వైద్యులైతే ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "ఆరోగ్యశ్రీ"నే తన ఆసుపత్రి ప్రచారానికి వాడుకుంటున్నాడు.

5 లో..

◆ హుజురాబాద్, ప్రజాజ్యోతి

## ప్రజల గొంతుతడిపే అద్భుత స్కీం అమృత్



2 లో..

- ప్రతి ఇంటికీ నీరు అందించాలన్నదే మా లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమృత్ పథకం అమలు
- అమృత్1, 2 కింద రాష్ట్రానికి రూ.6,876 కోట్లు కేటాయింపు
- అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా పనిచేస్తాం
- టెంపుల్ సర్క్యూట్ పరిధిలోకి వేములవాడ, కొండగట్టు ఆలయాలు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- కరీంనగర్ లో అమృత్ 2 పథకాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు హాజరు

## జమ్మికుంట లో మొండికేస్తున్న మిల్లర్లు

..మొదలుకాని కొనుగోళ్లు..

పెండింగ్ లో చర్చలు.. వడ్లను కొనడానికి నిరాకరిస్తున్న మిల్లర్ల..

వడ్లు కేంద్రాల వద్దే నిల్వ – రైతుల నిరీక్షణ

వర్షాల కారణంగా తడిసిన వడ్లు – రైతుల ఆవేదన



2 లో...

## పాత కూరగాయల మార్కెట్ లో మళ్ళీ మొదలైన లొల్లి

కూరగాయల వ్యాపారులతో మునిసిపల్ సిబ్బంది వాగ్వాదం.

తెర వెనుక ఉండి నడిపిస్తున్నది ఎవరు..?

పాత మార్కెట్ కి పూర్వ వైభవం వచ్చేనా..?



2 లో...

# పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**చొప్పదండి, నవంబర్ 4 (ప్రజాజ్యోతి):**

చొప్పదండి మండలం రుక్మాపూర్ లో సీసీఐ ఆధ్వర్యంలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. చాకుంట గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రం తో పాటు వెదురుగట్ట గ్రామంలో డి సి ఎం ఎస్ ద్వారా కొత్తగా అనుమతులు పొంది రైతులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ రంగ సంస్థ అయినటువంటి సీసీఐకి నాణ్యమైన పత్తి తీసుకువచ్చి మొదటి రకం ధరను పొందాలన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా తక్కువ ధరలకు కొంటూ రైతులను మోసం చేయాలని చూస్తే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. వెదురుగట్ట గ్రామంలో తాటి చెట్టు పై నుండి పడి నడుం విరిగి మంచానికే పరిమితమైన గీత కార్మికుడు మడ్డి లచ్చయ్యను పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. భూపాలపట్నం గ్రామానికి చెందిన ఎలగందుల సుకుమార్ చిన్న వయసులోనే అకాల మరణం చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. రాబోవు రోజుల్లో వీరి కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ఆదుకోవడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో

## వాగొడ్డు రామన్నపల్లిలో సేవా కార్యక్రమాలు





**ఇల్లందకుంట,నవంబర్4,ప్రజాజ్యోతి:**

ఇల్లందకుంట మండలంలోని వాగొడ్డు రామన్నపల్లె గ్రామంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు కరీంనగర్ జిల్లా యువ విభాగం ఆధ్వర్యంలో నగర సంకీర్తన, వైద్య శిభిరం, గృహ భజనలు,బాలవికాస్ కార్యక్రమాలు నిర్వహించారు..ఈ సందర్భంగా సత్యసాయి సేవసంస్థల యువ విభాగం సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో వైద్య శిబిరంలో భాగంగా గ్రామ ప్రజలకు సుమారు 150మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందజేశామన్నారు.. గ్రామంలో ప్రతి ఇంట భజన కార్యక్రమం ఎంతో భక్తిశ్రద్ధలతో 9 ఇండ్లలో భజన కార్యక్రమం నిర్వహించారు..గ్రామంలోని పిల్లలకు నీతి కథలు బోధించి ప్రోటీన్ పౌడర్ పంపిణీ చేశారు..గ్రామంలోని దేవాలయంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశామని తెలిపారు..ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు పి. లింగమూర్తి, జమ్మికుంట సమితి కన్వీనర్ డాక్టర్ సత్యం సావిత్రి,డాక్టర్ ముక్క శరత్, ,డాక్టర్ సాయి లక్ష్మి జిల్లా యువ సమన్వయకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## డబ్బా గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజా జ్యోతి: జగిత్యాల్,నవంబర్ 4**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించరు రైతులకు ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇస్తు దొడ్డు వడ్లకు మద్దతు ధర 2320 రూపాయలు ఇస్తున్నట్లు రైతులందరూ దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు.కేంద్రాలలో అమ్ముకోవాలని, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర పొందాలని రైతులకు రైతాంగానికి మేలు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని ఈ సందర్భంగా గుర్తు చేశారు ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భూస రాజేశ్వర్ భూక్యా రాజేందర్ మరియు డబ్బా గ్రామ మాజీ సర్పంచులు కంఠం రమేష్ పుప్పాల నర్సయ్య లింగంపల్లి గంగాధర్ మరియు నాయకులు దేశెట్టి జీవన్ జానా శంకర్ ఎలుక అశోక్ కోటి దేవారెడ్డి బైన నడిపి మల్లయ్య పాడి ప్రొక్యూర్మెంట్ డీసీఎంఎస్ వోల్లాడపు శ్రీనివాస్ రైతులు అమిలాల్ రంజిత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ కు ఎంపికైన సైనిక్ విద్యార్థులు



**చొప్పదండి, నవంబర్ 4 (ప్రజా జ్యోతి):**

రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ కు చొప్పదండి మండలం రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు సైనిక్ స్కూల్ డైరెక్టర్ కెసి రావు తెలిపారు. ఈనెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా అంబేద్కర్ స్టేడియంలో అండర్ 17 విభాగం రాష్ట్ర టోర్నమెంట్ జరగనున్నట్లు డైరెక్టర్ వివరించారు. కరీంనగర్ జిల్లా టీం తరపున రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు వి. మనోజ్, ఎన్. భరత్, ఆర్. భరత్, టి .గౌతమ్, కె .తేజ, ఆర్. హృతిక్ పాల్గొంటారని తెలిపారు.

## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి




**చొప్పదండి, నవంబర్ 4 (ప్రజా జ్యోతి):**

చొప్పదండి పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగ పరిణామాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకమైన యువత మాదకద్రవ్యాల బారిన పడటం బాధాకరమని అన్నారు. మత్తు పదార్థాలు వివిధ రూపాల్లో లభిస్తుండడంతో ధూమపానం మద్యపానం వంటివి క్రమంగా జీవితంలో భాగమైపోతున్నాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో విచక్షణ మరిచి నేరాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్, చైల్డ్ వెల్ఫేర్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సంపత్, కానిస్టేబుల్ స్వప్న, మిషన్ పరివర్తన కమ్యూనికేటర్ మాలతి, పాఠశాల ఇంచార్జ్ శంబయ్య, ప్రిన్సిపాల్ సాంబరాజు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయండి రూ.500 బోనస్ ఇవ్వండి

### తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించిన శంకరపట్నం బిజేపి నేతలు...

**ప్రజాజ్యోతి కరీంనగర్ బ్యూరో:**

రైతుల పంట ( వడ్లను ) తక్షణం కొనుగోలు చేయాలని, మద్దతు ధరతో పాటు రూ. 500బోనస్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిజెపి శంకరపట్నం మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో సోమవారం మండల తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లాకు ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ శంకరపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతుల పంట కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన కొనేదిక్కు లేకుండా పోయిందన్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించని దుస్థితి ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కుప్పలను పోసుకొని రైతులు రోజుల తరబడి పంట కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న దయనీయ పరిస్థితి ఏర్పడిందని, ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలన్నీ వడ్ల కుప్పలతో నిండిపోయి, స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. వాతావరణ పరిస్థితులు, పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షానికి రైతులు పంట కాపాడుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్ల విషయంలో చేస్తున్న ప్రకటనకు ఆచరణకు పొంతన లేకుండా పోయిందన్నారు. రైతుల పంట కొనుగోళ్ళ విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు , కొర్రీలు పెట్టకుండా పూర్తిస్థాయిలో పంటను కొనుగోలు చేయాలని ,వడ్ల కొనుగోళ్లను తక్షణం ప్రారంభించాలని , అలాగే అన్ని రకాల సన్న వడ్లకు మద్దతు ధర చెల్లించి , కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 500 బోనస్ వెంటనే ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.అలాగే కొనుగోలు కేంద్రాలలో కోసం రైతుల కు కనీస వసతులు ఏర్పాటు చేయాలని , కొనుగోలు కేంద్రాల్లో రైతులు నీడ పట్టున ఉండడానికి చర్యలు తీసుకొని , త్రాగునీరు, టార్పాలీన్లు అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొయ్యడ అశోక్, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు కనకం సాగర్, శక్తి కేంద్ర ఇన్చార్జులు రాసమల్ల శ్రీనివాస్, బొజ్జ సాయి ప్రకాష్, చెర్ల శ్రీనివాస్, దాసరి సంపత్, వడ్లకొండ రాజేందర్, రెడ్డి శ్రీనివాస్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలి



**హుజురాబాద్, నవంబర్4,ప్రజాజ్యోతి:**

హుజూరాబాద్ మండలంలో రైతులు పండించిన వడ్లు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన కొనేదిక్కు లేకుండా పోయిందని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు... పలు గ్రామాల్లో ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలనే ప్రారంభించని దుస్థితి ఉందని, కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కుప్పలను పోసుకొని రైతులు రోజుల తరబడి పంట కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న దయనీయ పరిస్థితి ఉంద ని మండిపడ్డారు...ముఖ్యంగా కొనుగోలు కేంద్రాలన్నీ వడ్ల కుప్పలతో నిండిపోయి, స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించకపోవడం బాధాకరం అని.. వాతావరణ పరిస్థితులు, పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షానికి రైతులు పంట కాపాడుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు..రాష్ట్రప్రభుత్వం కొనుగోళ్ల విషయంలో చేస్తున్న ప్రకటనకు ఆచరణకు పొంతన లేకుండా పోయిందని,రైతుల పంట కొనుగోళ్ళ విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు , కొర్రీలు పెట్టకుండా పూర్తిస్థాయిలో పంటను కొనుగోలు చేయాలని, పంట కొనుగోళ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని, వడ్ల కొనుగోళ్ల ను తక్షణం ప్రారంభించాలని , అలాగే అన్ని రకాల సన్న వడ్లకు మద్దతు ధర చెల్లించి , కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూపాయలు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ, మండల శాఖ కమిటీలు ప్రజా ప్రతినిధులు బిజెపి జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, సీనియర్ నాయకులు రావుల భాస్కర్ రెడ్డి, విజేందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి తూర్పాటి రాజు, పట్టణ కార్యదర్శి పడారి కొమురయ్య, పోతుల సంజీవ్, యాళ్ల సంజీవరెడ్డి, తిప్పపతిని రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనటం జరిగింది.

## బ్రహ్మకుమారిస్ సంస్థ సేవలు అమోఘం

### – మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక



**హుజురాబాద్,నవంబర్4,ప్రజాజ్యోతి:**

బ్రహ్మకుమారి సంస్థ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు అమోఘం అని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక అన్నారు. సోమవారం పట్టణంలోని బ్రాహ్మకుమారి సంస్థ భవన రెనోవేషన్ కార్యక్రమానికి చైర్ పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడారు. రాజయోగ మెడిటేషన్ ద్వారా మన శ్యాంతి పొందవచ్చునన్నారు. బ్రహ్మ కుమారీస్ కేంద్రాలు ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతున్నాయన్నారు. ప్రజలందరూ పరమాత్ముని యందు సంపూర్ణ నిష్ఠ కలిగి ఉండాలన్నారు. సంస్థకు తమ వంతు సహాయ సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు కల్పన, శ్రీవాణి, జ్యోతి, రాజయ్య, ఈశ్వరయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

**ప్రజా జ్యోతి: జగిత్యాల్, నవంబర్ 4**



ప్రజావాణి ఫిర్యాదులు : 22జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్.ప్రజా జ్యోతి: జగిత్యాల్,నవంబర్ 4ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డితో కలసి కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 22 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, ఆర్డీఓ లు మధు సుధన్, శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ.హన్మంతరావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అభినందించిన శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

**ప్రజాజ్యోతి కరీంనగర్ బ్యూరో:**



జాతీయ సాహస శిబిరం 2024 పదిరోజుల శిక్షణ కార్యక్రమాన్ని ధర్మశాల హిమాచల్ ప్రదేశ్ లో విజయవంతంగా ముగించుకొని వచ్చిన పదిమంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను వారితో పాటుగా ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ ఆర్సెంట్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంటిజెంట్ లీడర్ డాక్టర్ పడాల తిరుపతిని వైస్ ఛాన్సలర్ అభినందిస్తూ, జాతీయ సాహస శిబిర శిక్షణ కార్యక్రమాలలో శాతవాహన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల యొక్క శిక్షణ,ప్రతిభా పాటవాలను తెలుసుకొని ప్రశంసించారు. వీరితోపాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ మనోహర్ గారు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కాంటినెంట్ లీడర్ డాక్టర్ పడాల తిరుపతిని అభినందిస్తూ చక్కటి సమన్వయంతో సాంస్కృతిక కార్యక్రమాలలో తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించి జాతీయ స్థాయిలో శాతవాహన విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రతిభను చాటినందుకు సగర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఆడేపు శ్రీనివాస్, డాక్టర్ డాక్టర్ అర్జున్, డాక్టర్ వి రాజేశం, డాక్టర్ గోలి శ్రీనివాస్ తదితర ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### జమ్మికుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు జీడి మల్లేష్

**జమ్మికుంట, నవంబర్4,ప్రజాజ్యోతి :**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్రంగా మోసం చేసిందని బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ ఆరోపించారు... ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జమ్మికుంట తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు... అనంతరం జీడి మల్లేష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని మినిమం సపోర్ట్ ప్రైస్ ధరకు 500 రూపాయలు బోనస్ కలిపి కొంటామని చెప్పి అధికారంలోకి వచ్చాక నేడు సన్న రకం వరి ధాన్యాన్నికి మాత్రమే 500 రూపాయల బోనస్ ఇస్తామని దొడ్డు రకం వరి ధాన్యానికి బోనస్ ఇవ్వలేమని చెప్పి రైతులను మోసం చేశారని జీడి మల్లేష్ మండిపడ్డాడు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా దొడ్డు రకం వరి ధాన్యానికి కూడా 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, కానీ వరి కోతలు ప్రారంభమై రైతులు దిక్కుతోచని స్థితిలో తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు వరి ధాన్యం అమ్ముకునే దుస్థితి రాష్ట్రంలో తయారైందని, దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వం సరైన సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమేనని మల్లేష్ ఆరోపించారు. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు అన్నకి ఇది నిదర్శనం అని అన్నారు. వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన ప్రతి గింజలు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించి, గన్ని సంచులు, సుతిలు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. లేనట్లయితే బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మల్లేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోరే రవీందర్, పల్లపు రవి, మేక సుధాకర్ రెడ్డి, ఇటికాల స్వరూప, మోడం రాజు, బూరుగుపల్లి రామ్, రాచపల్లి ప్రశాంత్, రామస్వామి, ముకుందం సుధాకర్, అప్పల రవీందర్, కొండపర్తి ప్రవీణ్, యాంసాని సమ్మయ్య, సృజన శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు సమర్పించిన శ్రీ గాయత్రి దుర్గాదేవి ఓడు బియ్యం

**ప్రజా జ్యోతి: జగిత్యాల్, నవంబర్ 4**

జగిత్యాల పట్టణ పద్మశాలి సేవా సంఘం భక్త మార్కండేయ దేవాలయంలో శ్రీ గాయత్రీ దుర్గ శరన్నవరాత్రులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నవరాత్రుల్లో భక్తులు సమర్పించిన ఓడిబియ్యం కార్యక్రమాన్ని ఈరోజు కార్తీక మాసంలో అమ్మవారి ప్రసాదముగా భక్తులకు అన్న ప్రసాదం అందించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు భోగ గంగాధర్ ఉపాధ్యక్షులు భోగ రాజ్ కుమార్ మరియు కార్యదర్శి రాజేందర్ సహాయ కార్యదర్శి మహేష్ కోశాధికారి ప్రభాకర్ కార్యవర్గ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# ఆసుపత్రి ప్రచారానికి "ఆరోగ్యశ్రీ"

హుజురాబాద్, నవంబర్ 4, ప్రజాజ్యోతి :

నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి రెండు లక్షల వరకు వైద్య సేవలను ప్రవేట్ ఆసుపత్రుల్లో సైతం అందించే విధంగా చర్యలు చేపట్టారు. అప్పటినుండి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకాన్ని అలాగే కొనసాగిస్తూ వచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత పరిమితిని పెంచి ఇస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది అక్రమార్కులు ఆరోగ్యశ్రీ ఏర్పాటు చేసేందుకు ఏలాంటి అర్హతలు లేకపోయినప్పటికీ తమ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ఉందంటూ ప్రచారం చేస్తూ రోగులను ఆకర్షిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఉందనుకొని తన వద్దకు వచ్చిన రోగులను హనుమకొండ, కరీంనగర్ వంటి పట్టణాల్లోని కార్పోరేట్ స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల పలువురు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. – మా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయబడునుఆరోగ్యశ్రీ ఏర్పాటు చేసేందుకు ఎలాంటి అనుమతులు, సదుపాయాలు లేకుండానే తమ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సౌకర్యం ఉందంటూ పట్టణానికి చెందిన బాలాజీ ఆర్థో, జనరల్ ఆసుపత్రి వైద్యులు బోర్డ్ను ఏర్పాటు చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రికి వెళ్లిన రోగులను వేరే ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ ఓపి, ప్రథమ చికిత్సల పేరిట డబ్బులు దండుకుంటున్నారు. ఆస్పత్రి యాజమాన్యం బహిరంగంగానే ఆరోగ్యశ్రీ సౌకర్యం కలదని బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తుంది. మామూళ్లో మత్తులో పడి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇలాంటి ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు.

**- ఆరోగ్యశ్రీ అనుమతి పొందాలంటే ఈ సదుపాయాలు ఉండాల్సిందే..**

ఆరోగ్యశ్రీ అనుమతులు పొందాలంటే ఆసుపత్రులకు ఉండాల్సిన సదుపాయాలు ఇవే. 50 పడకల ఆసుపత్రి అయి ఉండాలి, ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేసే వైద్యులు కచ్చితంగా ఉండాలి. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, ఐసీయూ ఉండాలి. జనరల్ వార్డులో సైతం ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందిన రోగులకు 8 బెడ్ లను ఏర్పాటు చేయాలి. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కౌంటర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. ఆరోగ్యశ్రీ ద్వారా నియమించబడిన ఆరోగ్య మిత్రలు కచ్చితంగా ఉండాలి.

### హుజురాబాద్ లో ఏ ప్రైవేటు ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సౌకర్యం లేదు.

**– డిప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ చందు**



హుజురాబాద్ పట్టణంలో ఏ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సదుపాయం లేదని తెలిపారు. ఎవరైనా ఆరోగ్య శ్రీ సదుపాయం ఉందని తప్పుడు ప్రచారాలు చేస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రిని మూసివేయడంతో పాటు సదరు వైద్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రైవేటు టీచర్లకు 2 లక్షల ఆరోగ్య బీమా

**పైలెట్ ప్రాజెక్టు కింద గోదావరిఖనిలో ప్రారంభం..**

**నవంబర్ 6 లోపు ప్రతి పట్టభద్రుడు తమ ఓటును నమోదు చేసుకోవాలి**

**ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా గోదావరిఖనిలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం..**



ప్రజాజ్యోతి, కరీంనగర్ బ్యూరో:

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తన సొంత నిధులతో 2 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం గోదావరిఖని పట్టణంలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. తనకు మద్దతు తెలిపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లకు ఉద్యోగ భద్రత తో పాటు వారికి హెల్త్ కార్డుల మంజూరు కై కృషి చేస్తానని అన్నారు. ప్రైవేట్ టీచర్ల సంక్షేమం కోసం తన సొంత నిధులతో రెండు లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించి వారికి అండగా ఉంటానని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇచ్చే సమయంలో కఠినతరమైన నిబంధనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఫైర్ సేఫ్టీ, క్రీడా మైదానాలు, నీటి వసతుల తదితర అంశాలను ప్రభుత్వం పరంగా అందించేందుకు కృషి చేస్తారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కనీస వేతనం చట్టంను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. మినిమమ్ బేసిక్ శాలరీ (ఏంబిఎస్) అమలు జరిగే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాల యజమాన్యాలకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంటు బకాయిలను విడుదలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.. ప్రతి ఒక్క పట్టభద్రుడు నవంబర్ 6 లోపు తమ యొక్క ఓటు నమోదును చేసుకోవాలని పిలుపునిచ్చారు. మిస్డ్ కాల్ క్యాంపెయిన్ ద్వారా ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## పదోన్నతి పొంది జీఎంగా బదిలి పై వెళ్తున్న రాధాకృష్ణకు ఘన సన్మానం



రామగిరి, నవంబర్ 4, ప్రజాజ్యోతి

జీఎం ఎస్టేట్స్ గా పదోన్నతిపై వెళుతున్న ఓసీపీ–1 ప్రాజెక్ట్ ఆఫీసర్ నలజాల రాధా కృష్ణకు కార్మికులు, గని ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు. క్లిష్టపరిస్థితులలో మూతపడుతున్న స్థితి నుంచి 30 సంవత్సరాల పాటు గని జీవితకాలన్ని పెంచిన ఘనత జిఎం ఎస్టేట్స్ గా పదోన్నత్తిపై కొత్తగూడెం వెళుతున్న గని ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధాకృష్ణదే నని కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. 2001 జూలై నెలలో ప్రాజెక్టు అధికారిగా వచ్చి నాలుగు సంవత్సరాల నాలుగు నెలల కాలం పాటు సుదీర్ఘంగా పనిచేసి ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని ఫాల్ట్ ఏరియాలో దాగి ఉన్న బొగ్గు నిల్వలు వెలికి తీసి వార్షిక లక్ష్యానికి మించి అధిక ఉత్పత్తిని అందించే ప్రణాళికలతో గనిని నడిపి, ప్రతి ఏడు ఉత్తమ గనిగా అవార్డులతో పాటు, ఈ మధ్యనే 5 స్టార్ రేటింగ్ అవార్డుతో ఓసి1 గనితో పాటు సింగరేణి పేరును దేశంలో చాటిన ఘనత రాధాకృష్ణ దే నని కొనియాడారు. వర్షాభావంతో నిండిన సంపులోని నీళ్లను తోడే ప్రక్రియ, అధిక వేడి గ్యాస్ తో కలిగి ఉన్న బొగ్గు నిలువలను సమర్థవంతంగా సురక్షితంగా వెలికి తీసే ప్రయత్నంలో తన అనుభవ చాతుర్యంతో గనిని నడిపి లక్ష్యానికి మించి అధిక ఉత్పత్తి సాధనలో గనికి మంచి పేరు సాధించిన ఘనత రాధాకృష్ణ దేనని కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. ఉద్యోగులు. సింగరేణి ఆర్జీ 3 ఓసి–1 గని సైట్ ఐఎన్టియూసి కేంద్ర కమిటీ నాయకుడు గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అన్ని విభాగాలు ఉద్యోగులు పాల్గొని శాలువాలు, మెమెంటోలు అందిస్తూ, స్వీట్ తినిపించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాధాకృష్ణ విధి నిర్వహణలో తనకున్న అనుభవంతో క్లిష్ట పరిస్థితుల్లో బావి నడుపుటకు సహకరించిన ఉద్యోగులందరికీ మనస్ఫూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని మేనేజరు ఉదయ్ హరిజన్, రక్షణ అధికారి శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఉదయభాస్కర్, బైరి రమేష్, మధు, కేవిరమణా రెడ్డి, వినాయక్, జనార్దన్, సంక్షేమ అధికారులు సునీల్ ప్రసాద్, సాయికృష్ణ, యూనియన్ నాయకులు డిటి రావు వెంకటస్వామి, శ్రీనివాసరావు ప్రభాకర్ రెడ్డి, కొలిపాక సారయ్య, సాంబయ్య, దుస్స రవీందర్, చంద్రయ్య, రవికుమార్, పెద్ది సమ్మయ్య, ఆకుల మల్లయ్య, కిషన్ నాయక్, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు కృతజ్ఞతలు

**– మేకల మారుతి యాదవ్**



రామగిరి, నవంబర్ 4, ప్రజాజ్యోతి

తెలంగాణలో యాదవుల అతి ముఖ్యమైన జీవనాధారం అయినా పాడి పరిశ్రమ, ఆ జీవాలతో యాదవుల జీవితంలో విడదీయరాని అనుబంధం ఉంటుంది దానికి గుర్తుగా దీపావళి పండుగ తర్వాత రెండో రోజు జరుపుకొనే పాడి పరిశ్రమకు సంబంధించిన జీవాలను అలంకరించి వాటిని పూజించే సంప్రదాయం స్వాతంత్రం రాకముందు నిజాం కాలం నుంచి కొనసాగుతుంది. అట్టహాసంగా జరుపుకునే యాదవుల సదర్ సమ్మేళనాన్ని పండుగను రాష్ట్రపండుగగా గుర్తించినందుకు మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు శనివారం నవంబర్ 02న రోజున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సదర్ సమ్మేళనాన్ని ప్రతి ఏడాది రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను శాంతి కుమారి ఆదేశించారు. ఇట్టి గొప్ప నిర్ణయాన్ని తీసుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారికి, రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు గారికి యాదవ సమాజం పక్షాన మేకల మారుతి యాదవ్ శనర్థులు తెలియజేశారు. యాదవులందరూ ఐక్యతతో ఉండి సదర్ సమ్మేళనాన్ని ప్రతి గ్రామ గ్రామాన పండగల నిర్వహించాలని కోరారు.

## కన్నూరి శ్రీశైలం కు గౌతమి నంది అవార్డు




రామగిరి, నవంబర్ 4, ప్రజాజ్యోతి

మండలంలోని బుధవారం పేట గ్రామానికి చెందిన కన్నూరి శ్రీశైలంకు గౌతమీ నంది అవార్డును అందుకున్నారు. దీపావళినీ పురస్కరించుకొని ఆదివారం హైదరాబాదులోని త్యాగరాజ కీర్తన ఆలయంలో జరిగిన గౌతమి నంది అవార్డు ప్రధాన ఉత్సవాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అను అణగారిన వర్గాల నుండి తాను చేస్తున్న సేవలకు కాను కన్నూరి శ్రీశైల మహాదేవ్ ఆధ్యాత్మిక వేత్తగా లెజెండ్ అవార్డును తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం కనిమీరు దైవాగ్నేష్ శర్మ, అవదానుల ప్రసాద్ శర్మ, కేడియం చారిటబుల్ ట్రస్టు విశ్వవిఖ్యాత అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్పీ వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించి ఆధ్యాత్మిక రంగంలో లెజెండ్ అవార్డును ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాతంగి కళ్యాణి, జ్యోతి, రాధిక, కోటేశ్వర్, వంశీధర్ శర్మ, గోకుల్నాథ్ జోషి పాల్గొన్నారు.

## తెలంగాణ చేనేత ఐక్య వేదిక జిల్లా ప్రచార కార్యదర్శిగా కృష్ణ




రామగిరి, నవంబర్ 4, ప్రజాజ్యోతి

రామగిరి మండలం నాగ పెల్లికి చెందిన సింగరేణి ముద్దుబిడ్డ, సమాజ సేవలో ముందుండి నడిపించే సేవా గుణం కలిగిన తాటిపాముల కృష్ణను తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ ఆదేశాల మేరకు తెలంగాణ చేనేత ఐక్య వేదిక జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఆడపు శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని, పద్మశాలి జాతి చైతన్యం కోసం చేనేత కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని, చేస్తారని ఆశీస్తూ ఆయన హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# బ్యాంకు గ్యారంటీ తొలగిస్తేనే మిల్లింగ్ చేస్తాం..

### ప్రభుత్వానికి రైస్ మిల్లర్ల అల్టిమేటం

*ప్రజాజ్యోతి, కరీంనగర్ బ్యూరో:*

రాష్ట్ర ప్రభుత్వం 2024 – 25 సంవత్సరానికి గాను మిల్లింగ్ నిబంధనలో భాగంగా రైస్ మిల్లుల యజమానులు బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ నియమం విధించింది. అయితే దీనిపై రైస్ మిల్లుల యజమానులు మండిపడుతున్నారు. స్థానిక శుభ మంగళ ఫంక్షన్ హాల్ లో కరీంనగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మీడియా సమావేశం నిర్వహించింది. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి నర్సింగరావు, తొడుపునూరి కరుణాకర్ లు మాట్లాడుతూ బ్యాంకు పూచికత్తు నిబంధన ఎత్తివేయకుంటే ఈ సీజన్ వడ్లను మిల్లింగ్ చేయమని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ




చేశారు. నిబంధన కొనసాగిస్తే చిన్న రైస్ మిల్లర్లకు సంకట స్థితి నెలకొనే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ధాన్యాన్ని దించుకోవడానికి గోదాములు లేవని, ఒక్కో జిల్లాకు సుమారు 800 కోట్ల వరకు మిల్లింగ్ చార్జీలు పెండింగ్లో ఉన్నట్లు తెలిపారు. దీంతో రైస్ మిల్లర్లు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఒక్క క్వింటా వడ్లకి 67 కిలోల బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం చెబుతుంది కానీ తడిసిన ధాన్యం ముక్కిపోయిన వడ్లను మాకు అంటగడితే వాటిని మిల్లింగ్ చేస్తే 55 కిలోల బియ్యం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మిల్లర్లు నష్టాలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తెలంగాణలో అతిపెద్ద రైస్ ఇండస్ట్రీని ఇబ్బందుల పాలు చేయొద్దని, వేలాది కుటుంబాలు ఇండస్ట్రీపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. పుష్కలమైన నీటి లభ్యతతో అత్యధిక దిగుబడి వస్తుందని ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తే ప్రభుత్వానికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని, పూచికత్తు నిబంధన తొలగించి రైస్ మిల్లర్లకు సహకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్యారంటీ పేరుతో రైస్ మిల్లర్లను మోసగాళ్లుగా చిత్రీకరించకూడదని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రా రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షులు తణుకు సురేష్, డైరెక్టర్ శ్రీధర్ రవీందర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ లో ప్రారంభమైన వడ్ల కొనుగోలు కేంద్రం



*జమ్మికుంట, నవంబర్4, ప్రజాజ్యోతి:*

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సోమవారం ఉదయం ప్రారంభించారు.. జమ్మికుంట లోని పాత వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చే వడ్లని ఆరబెట్టుకుని తీసుకురావాలని తేమశాతం 17లోపు ఉన్నట్లయితేనే కొనుగోలు చేయడం జరుగుతుందని ఏ గ్రేడ్ రకం క్వింటాల్ 2320 రూపాయలు, సాధారణ రకం 2300 చొప్పున కొనుగోలు చేస్తామని తెలిపారు.. రైతులు పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లు, అందించాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, సొసైటీ వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ సెక్రెటరీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, సీఈవో రవీందర్ జమ్మికుంట సొసైటీ డైరెక్టర్లు రాజయ్య తిరుపతి శ్రీలత బక్కయ్య తిరుపతిరావు రాధిక లింగారావు రాజశేఖర్ కుమార్ సమ్మయ్య రమాదేవి, జమ్మికుంట ఆర్థిదారుల సంఘం అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కాలర్ షిప్



*రామగిరి, నవంబర్ 04 (ప్రజాజ్యోతి ):*

మండలంలోని నాగపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రతిభావంతులైన ఆరుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ రెండువేల నగదు స్కాలర్షిప్ (ఉపకార వేతనం) ప్రజ్ఞా ఫౌండేషన్ (నార్వే) ఫౌండర్ కర్నె లక్ష్మీనారాయణ అందజేశారు. సోమవారం పాఠశాలకు విచ్చేసిన ఆయన ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు ఉపకార వేతనం( స్కాలర్షిప్) అందించి అభినందించారు. మా పాఠశాలను ఎంపిక చేసుకుని అమూల్యమైన సమయాన్ని వెచ్చించి ప్రతి సంవత్సరం విద్యార్థులకు స్కాలర్షిప్స్ ఇచ్చి ప్రోత్సహిస్తున్న కర్నే లక్ష్మీనారాయణకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తాలు లేని వరి ధాన్యానికే బోనస్

### కామన్పూర్ వ్యవసాయ అధికారి గిరి.రామకృష్ణ



*రామగిరి, నవంబర్ 04 (ప్రజాజ్యోతి ):*

తాలు, చెత్త చెదారం, లేకుండా వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి బోనస్ పొందాలని కామన్పూర్ మండల వ్యవసాయ అధికారి గిరి.రామకృష్ణ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని పలు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించారు. వరి ధాన్యంలో తేమ శాతం 17 ఉండే విధంగా చెత్త, తాలు ,మట్టి పే ల్లలు రాళ్లు, పాడైన పోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం, పూర్తిగా తయారు కానీ ధాన్యం, ముడుచుకపోయినా ధాన్యం లేకుండాచూసుకోవాలని రామకృష్ణ రైతులకు సూచించారు. నిబంధనల ప్రకారం రైతుకు బోనస్ వస్తుందని పేర్కొన్నారు ప్రభుత్వం బోనస్ ఇచ్చేందుకు విధివిధానాలను రూపొందించిందని దాన్ని పాటించిన రైతులకు మాత్రమే బోనస్ వస్తుందని పేర్కొన్నారు. ప్రతి రైతు వరి ధాన్యాన్ని అన్ని విధాల సరిచూసుకొని తీసుకురావాలని కోరారు.

## బిల్లులు చెల్లించమని అడిగితే అరెస్టులు చేస్తారా..?

### మాజీ సర్పంచ్ ల అరెస్టును ఖండించిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య...

*చిగురుమామిడి నవంబర్ 04: (ప్రజాజ్యోతి )*

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మాజీ సర్పంచ్ ల అరెస్టులను, అక్రమ నిర్బంధాలను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో మామిడి అంజయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్ లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడమేంటని అంజయ్య ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధి కోసం వెచ్చించిన బిల్లులు చెల్లించాలని అడిగితే అరెస్టు చేస్తారా అంటూ వారు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్ కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా ఎక్కడికి అక్కడ నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. మాజీ సర్పంచ్ లు అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నదని మామిడి అంజయ్య మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచులను అరెస్టులు చేయడమేనా అని అంజయ్య ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న చిన్న పనులు చేసిన మాజీ సర్పంచులకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని మామిడి అంజయ్య అన్నారు.



**చిగురుమామిడిలో మాజీసర్పంచ్ ల ముందస్తు అరెస్ట్..**

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ హైదరాబాద్ కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తాజా మాజీ సర్పంచ్లను చిగురుమామిడి పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారు సర్పంచ్ ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జక్కుల రవీందర్, మాజీ సర్పంచులు సన్నీళ్ల వెంకటేష్, గోలి బాపురెడ్డి, బెజ్జంకి లక్ష్మణ్, తదితరులు ఉన్నారు. మాజీ సర్పంచ్ అరెస్టులను, అక్రమ నిర్బంధాలను తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని జక్కుల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు.

## కార్తీక మాసంలో ఆలయాల్లో భక్తుల సందడి

### సిరిసేడు శివాలయంలో సామూహిక ఉసిరిక భోజనాలు

### శివన్నామస్మరణతో మారు మ్రోగిన ఆలయ ప్రాంగణం



*జమ్మికుంట, నవంబర్4, ప్రజా జ్యోతి:*

కార్తీక మాసం పవిత్ర మాసంలో ఆదిదేవునికి ఎంతో ప్రీతికరం..శివుడు... గంగాదేవి... పార్వతిదేవికి ఇష్టమైన మాసంలో ఉపవాసాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి కార్తీక మాసం అంటే ఇష్టమని భక్తుల నమ్మకం. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలోని శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి దేవాలయం లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా అలయకమిటి చైర్మన్ కొండ విజయ్ మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి రోజు సాయంత్రం శివాలయంలో ధ్వజస్తంభానికి తాడుకట్టి, చిన్న పాత్రలో దీపం వెలిగించి పైకెత్తుతారని, ఆ దీపం ధ్వజస్తంభంపై వెలుగుతూ ఈశ్వరునికి ఉత్సవం నిర్వహిస్తుందనే భావనతో ఇలా చేయడం ఆచారమని తెలిపారు. దీపం పర బ్రహ్మ స్వరూపం అని, ఈశ్వరుడు తేజోమయ మూర్తి అయి,ఆయన కాంతి సోకినప్పుడు మన లోని అజ్ఞానాంధకారాలు తొలగిపోతాయని 'పరం జ్యోతి'ని ఆరాధన చేస్తున్నామనే అంతర సంస్కారాన్ని కార్తిక దీపం ఉద్దీపనం చేస్తుందని భక్తులు నమ్ముతారని అన్నారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం సాయంత్రం భక్తులందరికీ సామూహిక ఉసిరిక భోజనాలు సదుపాయాలు భక్తుల సహాయం తో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గన్ను శ్రీకాంత్, డైరెక్టర్లు మురహరి నరేందర్, వేముల సుధాకర్ రెడ్డి, రేనుకుంట్ల సారయ్య, భక్తులు మరిగిద్ద మొగిలి, లక్ష్మీపతి, ఐలయ్య, పెద్దకుమారస్వామి, వినయ్, విజయ్, రామకృష్ణ, చిరంజీవి, రాజు, సుమారు 150 మంది భక్తులు పాల్గొన్నారు..

## రోడ్లపై ధాన్యాన్ని పోసి ప్రమాదాలకు కారణం కావొద్దు...

### విలేకరుల సమావేశంలో చిగురుమామిడి ఎస్సై బండి రాజేష్

*చిగురుమామిడి నవంబర్ 04: (ప్రజాజ్యోతి )*




రోడ్లపై ధాన్యాన్ని పోసి నల్ల పరదాలు కప్పడం వల్ల ధాన్యం కుప్పలు కనపడక ధాన్యము కుప్పకు ఢీకొని ప్రయాణికులు ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలా ఉన్నాయని, రోడ్లపై ఎవరు కూడా ధాన్యాన్ని కుప్పలు పోయవద్దని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ఎస్ఐ బండి రాజేష్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రోడ్లపై ధాన్యాన్ని పోయవద్దని ఎస్సై రైతులను కోరారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వ్యవసాయ పొలాల వద్ద, ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలని, నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దు ఎస్సై హెచ్చరించారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు ధాన్యం కుప్పకు తగిలి ప్రమాదలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై ధాన్యం పోయవద్దని రైతులకు సూచిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై వివరించారు.